క్లుప్తంగా

తిరుమల స్వామిని దర్శించుకున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గల తిరుమల స్వామి దేవాలయాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అసిస్టెంట్ కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎక్సైజ్ స్టార్ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎక్సైజ్ సీఐ రాణి, ఎస్సై విజయ్ సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

వైభవంగా పోచమ్మ ఆలయ ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయం ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం గణపతి పూజ, పుణ్యాహచనం, వరుణ పూజ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. శుక్రవారం యంత్ర ప్రతిష్ఠాపన, అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, అన్నదానం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పంటలకు జీవన ఎరువులు వాడండి



నార్సింగిలో పంటను పరిశీలిస్తున్న ఏఈఓ విజృంభణ

చిన్నశంకరంపేట(మెదక్): పంటలకు రసాయన ఎరువులను తగ్గించి జీవన ఎరువులను వాడాలని నార్సింగి ఏఈఓ విజృంభణ కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో రైతు బక్కన్నగారి పంటపొలంలో సేంద్రియ ఎరువులతో సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ విధానం ఆరోగ్యకరమైందని చెప్పారు. రైతులకు ఖర్చులను తగ్గించడంతో పాటు భూసారం పెరుగుతోందని చెప్పారు. ప్రతి రైతు జీవన ఎరువులను వినియోగించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

రామాయంపేట బీజేపీ మండలాధ్యక్షుడిగా నవీన్



నవీన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న విజయకుమార్

రామాయంపేట(మెదక్): బీజేపీ రామాయంపేట మండలశాఖ అధ్యక్షుడిగా నవీన్‌గౌడ్ నియమితులయ్యారు. గురువారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి విజయకుమార్ ఆయన్ను సన్మానించారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో క్యాడర్‌ను సమన్వయపర్చాలన్నారు. ఈ సందర్భంగా నూతన మండలాధ్యక్షుడు నవీన్‌గౌడ్ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కోళ్ల వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): కోళ్లకు వచ్చే వ్యాధుల పట్ల పౌల్ట్రీఫామ్ యజమానులు జాగ్రత్తగా ఉండాలని వెటర్నరీ డాక్టర్ సంధ్యారాణి సూచించారు. కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుతుండటంతో ముందస్తుగా పలు పౌల్ట్రీఫామ్‌లను వెటర్నరీ సిబ్బంది పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కోళ్ల ఆరోగ్యం గురించి అప్రమత్తంగా ఉండాలని వ్యాధులు సోకితే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

కుష్టుపై అవగాహన అవసరం

రామాయంపేట(మెదక్): కుష్టు వ్యాధిపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ అన్నారు. గురువారం ఆస్పత్రిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలచేత ప్రతిజ్ఞ చేయించారు. కుష్టు రహిత జిల్లాగా మార్చడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సీహెచ్‌ఓ కొండయ్య, పీహెచ్ఎన్ మనోహర పాల్గొన్నారు.

కంకరతేలి.. గుంతలు పడి

అధ్వానంగా ఎర్రమట్టి తండా రోడ్డు

- టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



అధ్వానంగా ఎర్రమట్టి తండాకు వెళ్లే రోడ్డు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ఎర్రమట్టి తండా రోడ్డు అధ్వానంగా మారింది. కంకరతేలి, గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం నడవడానికి సైతం అనుకూలంగా లేదని ప్రజలు వాపోతున్నారు. అయితే మరమ్మతుల కోసం ఇప్పటికే నిధులు మంజూరై టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. మండలంలోని భుజిరంపేట, వెంకటాపూర్ నుంచి ఎర్రమట్టి తండా మీదుగా కొల్చారం మండలంలోని రంగంపేట వరకు సుమారు మూడు కిలోమీటర్లు కంకర రోడ్డు ఉంది. ఏళ్ల క్రితం వేసిన రోడ్డు కావడంతో ప్రస్తుతం కంకతేలి నడిచేందుకు సైతం ఇబ్బందిగా ఉంది. గత ప్రభుత్వం బీటీరోడ్డు వేసేందుకు గాను రూ. 70 లక్షలు నిధులు మంజూరు చేసింది. దీంతో టెండర్లు జరగగా గజ్వేల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. ఇంతలో ప్రభుత్వం మారింది. నిధుల కొరతతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో సమస్య తీరడం లేదు. భుజిరంపేట, వెంకటాపూర్ గ్రామస్తులు ఎర్రమట్టి తండా మీదుగా రంగంపేట వెళ్లేందుకు ఈ రోడ్డు అనుకూలంగా ఉంటుంది. పనులు జరగకపోవడంతో చుట్టూ తిరిగి సుమారు ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రమట్టి తండా వాసులకు కౌడిపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేందుకు ఇదేదారి కావడంతో రోడ్డు సరిగాలేక అవస్థలు పడుతున్నారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని.. పనులు జరిగేలా చూస్తామని చెప్పారు.

త్వరగా రోడ్డు వేయాలి



రోడ్డుపై కంకరతేలడంతో నడిచేందుకు సైతం ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయంలో వాహనదా రులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై నుంచే గ్రామస్తులు పొలాల వద్దకు వెళ్తారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి త్వరగా రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

\- కాట్రోత్ కిషన్‌నాయక్, ఎర్రమట్టితండా

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని

ఎంపీడీవో శేషాద్రి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తూప్రాన్: ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని ఎంపీడీవో శేషాద్రి తెలిపారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో ఐటీసీ సునేహ్రాకల్ వాష్-ఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడం, కాల్చడం ద్వారా పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. పంచాయతీ కార్మికులు, పారిశుధ్య కార్మికులు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సతీశ్, ఐటీసీ వాష్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఏపీవో బి.జనార్ధన్, ఆర్. మల్లేశ్ హైజీన్ ఎడ్యుకేటర్ మహేశ్ పాల్గొన్నారు.

ఆ గన్నీ బ్యాగులు ఎక్కడ?

- గ్రామానికి 300 కేటాయింపు
- అధికారుల వద్దకు చేరినవి 84
- ఈ విషయమై పట్టించుకోని అధికారులు



గన్నీ బ్యాగులు

రేగోడ్(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రంలోని గన్నీ బ్యాగులు మాయమయ్యాయి. మండలంలోని మర్పల్లిలో ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి 300 గన్నీ బ్యాగులు వచ్చాయి. కొంతమంది మతలబు చేసి అధికారులకు 84 మాత్రమే ఇచ్చారని తెలిసింది. మిగతా బ్యాగులు మాయం కావడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై అధికార పార్టీ సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినా అదృశ్యం చేసినవి బయటపెట్టకపోవడం గమనార్హం. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఐకేపీ ఏపీఎం సంగీతను వివరణ కోరగా 84 మాత్రమే ఇచ్చారన్నారు. మిగతావి ఇవ్వాలని అడిగినా ఇవ్వడం లేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



విద్యుత్ కాంతుల్లో ఆలయం

- నేడు చిన్న జీయర్‌స్వామి రాక

రామాయంపేట(మెదక్): వెంకటేశ్వర ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శేషవాహన సేవతో పాటు బలిహరణములు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం శ్రీమన్నారాయణ చిన్న జీయర్‌స్వామి పూజా కార్యక్రమాలకు హాజరు కానున్నారు. ఆయన పర్యవేక్షణలో లక్ష్మీనారాయణ పూజా, కల్ప వృక్ష వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. భక్తులు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని వివరించారు.

అడ్డగోలు విమర్శలు సహించం



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నర్సాపూర్: అడ్డగోలు విమర్శలు చేస్తే సహించబోమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, పట్టణ అధ్యక్షుడు చిన్న అంజిగౌడ్ గురువారం విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డిలపై బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డిని తాము గౌరవిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనుల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని గత ప్రభుత్వం చేసిన పనులను గుర్తు చేయడం విచారకరమన్నారు. తమ నాయకుడు ఆవుల రాజిరెడ్డి ఓటమి చెందినా ప్రజల్లో ఉంటూ పేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నరేష్, రషీద్, సాగర్, లక్ష్మి, రవిగౌడ్,నరేందర్‌రెడ్డి, అజ్మద్ పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలి



ఫ్లెక్సీని తొలగిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులోకి వచ్చినందున గ్రామాల్లో వివిధ రాజకీయ నాయకులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయ నాయకులకు సంబంధించి విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. పారిశుధ్య చర్యలు సక్రమంగా చేపట్టాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల కోడ్.. ఫ్లెక్సీల తొలగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోనికి రావడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు ఎంపీఓ కలిముల్ల తెలిపారు. గురువారం కౌడిపల్లిలోని పలు ఫ్లెక్సీలను తొలగించారు. అన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించనున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఎలాంటి ఫ్లెక్సీలు వేయొద్దని సూచించారు.

పోస్టర్ల తొలగింపు

చిన్నశంకరంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థుల వాల్ క్యాలెండర్లను, పోస్టర్లను తొలగించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఎంపీడీఓ దామోదర్ తెలిపారు.

మహాత్మా.. సీఎంకు జ్ఞానోదయం కల్పించు..!

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి 420 రోజులైనా.. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు పలుచోట్ల గాంధీ విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. హామీలు అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని వేడుకున్నారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



నర్సాపూర్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శివ్వంపేట: ఎదుల్లాపూర్‌లో..



నర్సాపూర్‌రూరల్: కాగజ్ మద్దూర్‌లో..



చిన్నశంకరంపేట: నార్సింగిలో..



పెద్దశంకరంపేటలో..



మనోహరాబాద్: రంగాయపల్లిలో..



తూప్రాన్‌లో..



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో...



చిలప్‌చెడ్‌లో..



కౌడిపల్లి: రాయిలాపూర్‌లో ..

అంగన్‌వాడీ భవనం పూర్తి చేయాలని నివేదిక

సీడీపీఓ హేమభార్గవి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని లింగోజిగూడలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సీడీపీఓ హేమభార్గవి పేర్కొన్నారు. శిథిలావస్థ భవనంలో అంగన్‌వాడీ కొనసాగిస్తుండటంపై జిల్లా అధికారులకు నివేదించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటివరకు ప్రస్తుత భవనంలోని వరండాలో కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష, టీచర్ కవిత ఉన్నారు.

గదుల్లో చెత్త తొలగింపు

శివ్వంపేట(నర్సాపూర్): లక్షల వెచ్చించి ఈజీఎస్ కార్యాలయం కోసం నిర్మించిన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా ఉన్న విషయంపై సాక్షి దినపత్రికలో బుధవారం 'నిర్మించారు.. వదిలేశారు' కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా స్పందించారు. గురువారం సంబంధిత భవనం మొదటి అంతస్తు గదుల్లో పేరుకుపోయిన చెత్త, పేపర్లు తొలగించి శుభ్రం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వృథాగా ఉన్న భవనం మొదటి అంతస్తులో ఎదైనా కార్యాలయానికి ఉపయోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవనం వినియోగంలోకి వచ్చేందుకు కృషి చేసిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

కార్మికులకు దుస్తులు పంపిణీ



శంకరప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మాజీ సర్పంచ్ శంకరప్ప స్మారకార్థం గురువారం జీపీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులర్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ స్నేహితుడి కుటుంబానికి భరోసా

రేగోడ్(మెదక్): మండలంలోని కొత్వాన్‌పల్లికి చెందిన నవీన్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ స్నేహితులు వెంకటేశం, మల్లికార్జున్, రాములు, నర్సింహులు, కాంతారావు, జనార్దన్ కలిసి రూ. 28 వేలను మృతుడు నవీన్ కూతురు ప్రనూష పేరున పోస్టాఫీస్‌లో జమ చేశారు.

◆ కాంగ్రెస్‌తోనే సంక్షేమం

రేగోడ్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌కు చెందిన నారాయణకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు.

◆ నేడు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, నర్సింలు, బేతయ్య, అభిలాశ్‌రెడ్డి, చెన్నప్ప, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ దాతలు ముందుకు రావాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్‌లో కొలువైన వందల ఏళ్ల నాటి సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని దేవాలయ సేవకుడు రాజశేఖర్‌శర్మ కోరారు. శిథిలావస్థకు చేరిన ఆలయం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పలు పనులకు శ్రీకారం చుట్టామన్నారు.

◆ కూడలిలో గోతులతో ఇబ్బందులు

నర్సాపూర్: జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే ఎస్‌బీఐ కూడలి వద్ద పైపులైను లీకేజీ మరమ్మతులు చేసేందుకు తీసిన గోతులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇక్కడ పైపులైనుకు మరమ్మతు చేసి నీటిని వదలగా మరోచోట లీకేజీ ఏర్పడింది. దీని మరమ్మతు కోసం తీసిన గోయిని తాత్కాలికంగా మూసివేసి రోడ్డును తవ్వి స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయమై మిషన్ భగీరథ పథకం ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా పైపులైనుకు ఏర్పడిన లీకేజీకి మరమ్మతు చేయడానికి జాతీయ రహదారిని తవ్వాల్సి ఉందని, ఆ శాఖ అధికారుల అనుమతుల కోసం లేఖ రాశామని, అనుమతులు రాగానే మరమ్మతులు పూర్తి చేస్తామని వెల్లడించారు.

◆ గొయ్యి తీశారు.. పూడ్చడం మరిచారు

హవేళిఘణాపూర్(మెదక్): గొయ్యి తీశారు.. పూడ్చడం మరిచారు. హవేళిఘణాపూర్ వద్ద తొగుట వెళ్లే కమాన్ జాతీయ రహదారి పక్కన పైప్ లైన్ పగిలిపోతే అధికారులు మరమ్మతు చేశారు. కానీ తీసిన గుంతను మాత్రం వారం రోజులైనా గానీ పూడ్చకుండా వదిలేశారు. పక్కనే ఎంపీడీవో కార్యాలయం ఉన్నా ఇటు వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమని స్థానికులు పేర్కొన్నారు.

◆ నివారణ చర్యలతోనే పంటలు సురక్షితం

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన నివారణ చర్యలు పాటిస్తే పంటలు సురక్షితంతో పాటు అధిక దిగుబడి సాధించొచ్చని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని చండూర్, ఫైజాబాద్ గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. వరి పంటలో మొగి పురుగు ఉధృతిని గుర్తించామన్నారు. దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరాకు ఎనిమిది కిలోలు వాడాలన్నారు. క్లోరంట నిలిప్రోల్ 0.4జీ గుళికలు 4 కిలోలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దివ్వశ్రీ, రైతు జనార్ధన్ పాల్గొన్నారు.

◆ పేకాటరాయుళ్ల అరెస్ట్

వెల్దుర్తి(తూప్రాన్): పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలోని ఓ నివాస గృహం వద్ద పేకాట ఆడుతున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం నివాస గృహంపై సిబ్బందితో దాడిచేయగా మెట్ల ప్రాంతంలో మూడు ముక్కలాడుతూ పట్టుబడ్డారన్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 26,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

◆ విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని చిన్నశంకరంపేట ఎంఈఓ పుష్పవేణి కోరారు. గురువారం మండలంలోని భాగీర్థపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై బెల్ట్, ఐడీకార్డులు, వాటర్ బాటిళ్లను అందించారు.